# ఉత్తరం రావాలె

పోస్టుమాన్ కనిపించటంతోనే ఆదెమ్మ అడిగింది. "ఏం, సూరయ్యా, ఏమైనా ఉత్తరం ఉందా ?"

ఎందుకు అడగటం ? ఉత్తరం వస్తే అతనే ఇచ్చి వెడతాడు, మన యింటిదాకా వచ్చి ఉత్తరం ఇయ్యకుండా వెడతాడా? అయినా ఆమెకు అనుమానం !

అతడు చెయ్యి చూపి, పెదవివిరిచి "ఉత్తరాలులేవు" అన్నాడు. ప్రాణం చివుక్కు మన్నది. ఉత్తరం లేకపోవటమేమిటి ?

కూతురు దగ్గరనుంచి ఉత్తరం తప్పకుండా రావాలె. మూడు ఉత్తరాలు వ్రాసింది. ఒక్కదానికీ జబాబు లేకుండా ఉంటుందా ?

ఛా, ఛా! ఎప్పటికీ కాదు. ఇన్నాళ్లు వ్రాయకుండా ఉంటుందా అదెనుటుకు? ఎక్కడో పొరపాటు జరిగి ఉండాలె.

ఈ పోస్టుమాన్ చేతులో ఉత్తరాలకట్ట ఒకటిఉంది. నాకేమైనా ఉత్తరం ఉందా అని ఆదెమ్మ అడిగినప్పుడు ఆ కట్టలిప్పి, వెదికి లేదన్నాడా? అడిగీ అడగటంతోనే లేదు పొమ్మన్నాడు.

"ఇదిగో సూరయ్యా కాస్త చూడు నాయనా! ఉత్తరం ఒకటి అమ్మాయి దగ్గరనుంచి రావాలె ! నిళ్ళోసుకొన్న పిల్ల! కన్న కడుపుకాదు నాయనా, ఆదుర్దాగా ఉంది !

బాబు గాదూ, కాస్త చూడు. నీకు పుణ్యం ఉంటుంది. సత్తెన పల్లి నాయనా. సత్తెనపల్లి నుంచి వచ్చిన ఉత్తరాల్లో చూడద్దూ!" అని బ్రతిమిలాడింది ఆ దెమ్మ.

సూరయ్య పాపం మంచివాడు. కట్ట లిప్పి, ఎక్కడో మధ్యను తెరిచి చూచి చప్పరించి మళ్ళీ "లేవమ్మా" అన్నాడు.

ఇంకేం చేస్తుంది నా బొంద! చూచికూడా లేదంటూ ఉండె!

అసలు ఈ ఉత్తరాలు వచ్చే పద్ధతే నానా గొడవ గానూ ఉంది. పూర్వం రోజులలో అయితే, ఉత్తరాలు మనిషిచేతికి ఇచ్చి పంపేవాళ్ళు! మొదట్లోనే నమ్మకం గల మనిషిని చూచుకొని వాడిచేతికి మనం ఉత్తరం స్వయంగా మన చేతులతో ఇచ్చేవాళ్ళం! వాడు మనం ఇచ్చిన ఉత్తరాన్ని తీసుకొని జాగ్రత్తగా మడిచి ఉత్తరీయం కొంగున కట్టుకొని, ఆ ఉత్తరీయాన్ని తలపాగాగా చుట్టేవాడు. వాడి తలగుడ్డలో మన ఉత్తరం సురక్షితంగా ఉండటం మనం కళ్ళారా చూసేవాళ్ళం.

ఆ మనిషితో కూడా మనం ఒకటికి పదిసార్లు చెబుతాము. "ఉత్తరం జాగ్రత్తరా అబ్బాయి? అల్లుడుగారికిఇయ్యి. ఇంకెవ్వరికీ ఇయ్యకేం? అమ్మాయిగారిని కాస్త రహస్యంగా పలకరించిరా; అత్తమామలు ఎట్లా చూస్తున్నాదీ అంతా కనుక్కు రావాలె." వాడు మన యింటిమనిషి. నమ్మకస్తుడు. వాడు బయలుదేరి పోతుంటే,

మనకు ఉత్తరం అంది తీరుతు. దని ధైర్యం. మన కళ్ళఎదుట ఉత్తరం పోవటం మనం చూస్తాము. పూర్వకాలం సంగతి అల్లాంటిది.

ఇప్పు డేముంది, ఎంతోఆదుర్దాతో ఉత్తరం వ్రాస్తాము. దాన్ని తీసికెళ్ళి ఆ పోస్టు ఆఫీసులో ఒక బిలంలోకి నెట్టేస్తాము.

ఆ బిలంలోకి నెటితే అది ఏమైపోతుందో ఏమో!!

అయినా ఒక పెట్టె, బేడా అయితే పోనీ అని సరి పెట్టుకోవచ్చు. ఏమిటో అది! గోడలో ఉంటుందాయె, మంగ ళగిరి నరసింహస్వామి కబేళంలాగ నోరు తెరుచుకొని. అం దులోకి ఉత్తరాలుకొందరువిసిరిపారేస్తారు!కొందరు ధైర్యంగా ఆ నోట్లోకి చెయ్యి పోనిచ్చి, మెల్లగా జార విడుస్తారు. ఎట్లా గయితే నేం, ఆ బిలం, ఎంత పొడుగో, ఎంత లోతో ఎవరు చూశారు. ఆ ఉత్తరంగతి ఏమౌతుందో? గోవిందా అని అందులో పారేస్తుంటిమి, గంగలో పిండా లేసినట్లు వేస్తాము. అవి మన పిత్రుదేవతలకు అందుతవి అని నమ్మకం. అట్లాగే ఈ ఉత్తరాలు అందుతవి అని నమ్మకం.

ఆ ఉత్తరాలు ఊరూరుకు పోవలసినవి తీసి ప్రత్యే కంగా కట్టలు కట్టి రైల్లో పడేస్తారనీ, అక్కడి వాళ్లు ఈకట్ట లను, జాగ్రత్తచేసి, ఏవూరికట్ట ఆ వూళ్ళో పడేస్తా రనీ, పుకార్లు చాలాఉన్నాయి, కాని ఏమిటో, ఏది ఎంతవరకు నిజమో ఎవ్వరూ చెప్పలేరు.

పోనీ మనం వేసే ఉత్తరా లన్నీ ఒక పెట్టెలోనే పోతున్నాయ్ అనుకొందాం. అయితే మటుకు ఏమైనట్టు! మనం వేసే ఉత్తరం ఈ గొట్టం అంచులకు అతుక్కు పోయి, ఆపెట్టెలో పడకపోవచ్చు. అందుకనే కొందరు ఆ గొట్టాన్ని అటూ ఇటూ ఊగిస్తారు. కొందరు గొంతులోకి చెయ్యి పోనిచ్చి నెడతారు.

ఇంతా కష్టపడి ఉత్తరాన్ని ఎట్లాగో బలవంతాన నెట్టాము అనుకోండి. ఆ పోస్టుమాస్టరుగారు ఆ ఉత్తరాన్ని సరిగ్గా చూచి ఏవ్వూరు పోవాలో ఆవ్వూరు సంచిలో వెయ్యాలె గదా! ఆయన మటుకు ఎన్నని చూస్తాడు. విసుగు పుట్టి ఏ సంచిలోనో ఒక సంచిలో పారేస్తాడు. దాంతో గోవిందా!

అందుకనే ఉత్తరం పోస్టు చేసినప్పుడల్లా ఆదెమ్మ లోపలికి పోయి, ఆయనను నమస్కారంచేసి, 'బాబూ మా ఉత్తరం ఒకటి అందులో పడేశానండి. దయయుంచి మీరు దాన్ని శాస్త్రజాగ్రత్తగా పంపించాలె, అని మనవి చేసుకొంటూ ఉండేది!

కూతురుతో కూడా ఆ మాటే చెప్పింది. అందుకనే ఆ వూళ్ళో పోస్టుమాస్టరు ఉత్తరాలు జాగ్రత్తగా పంపుతూ ఉంటాడు.

ఉత్తరం వ్రాయించి దాన్నితీసుకెళ్ళి పోస్టుమాష్టరుకే ఇస్తుంది ఆ అమ్మాయి. ఆయన శాస్త్ర తెలిసినవాడు.

ఆయనకూడా ఆ అమ్మాయితో అంటాడట. "అమ్మకు ఉత్తరం వ్రాశావా తల్లి! ఇల్లాయియ్యిఅమ్మా నేను జాగ్రత్తగా పంపుతాను."

ఆ అమ్మాయి అంత జాగ్రత్తగా పంపుతుంది ఇక్కడే ఈ పోస్టు ఆఫీసులోనే ఏదో మిస్టీకు జరుగుతుంది. లేకపోతే ఎందుకు ఉత్తరం రాదూ? ఇది పెద్ద బస్తీ అయె... ఎన్నో ఉత్తరాలు వస్తాయి. కాస్తపలుకుబడి ఉన్నవాళ్ళవి, సాహుకార్లవి, గవర్నమెంటు ఆఫీసర్లవి చటుక్కున్న పంపేస్తారు! కొంతమంది అక్కడికే వెళ్ళి అడిగి, పట్టెకు, ఉత్తరాలు తెచ్చుకొంటారు!

ఆదెమ్మ బోటి దానికి ఎవరిస్తారు నాయనా! పోస్టుమేష్టరు గారికి ఆమె పేరు తెలియదు. ఉత్తరం వచ్చినా, ఆ పోస్టు ఆఫీసులో ఏబల్లక్రిందో పడి ఉంటుంది. ఎవరూ చూసి ఉండరు. ఎవరికి పట్టింది! ఈ బీదదాని పేరు ఎవరికి తెలుస్తుంది! అందుకనే ఆదెమ్మ ఇల్లా అన్నది.

"సూరయ్యా, అమ్మాయి నాకు ఉత్తరం తప్పకుండా, వ్రాసే ఉంటుందయ్యా. అది ఇన్నాళ్ళు వ్రాయకుండా ఊరుకొనే మనిషికాదు. అది ఆ ఆఫీసులో ఏమూలో పడి ఉంటుంది. నేను స్వయంగా వెతుక్కుంటాను, ఆఫీసులో మా అమ్మాయి వ్రాసినఉత్తరం, నాకుఇట్టె తెలుస్తుంది! మీకంటే కష్టంగాని! అమ్మాయి దస్తూరి నాకు గుర్తేగా నాయనా! ఏం, బాబు నీతో వచ్చి వెతుక్కోమంటావా?" సూరయ్య ఇలా

అన్నాడు–"పోస్టు ఆఫీసుకు నీవు ఆడదానివి రావాలా అక్కా! ఏమీ అక్కర లేదు. నేను వెళ్ళి పోస్టు ఆఫీసు అంతా వెదికి గాలించి వస్తాను. ఉత్తరం వచ్చి ఉంటే, నేనే తెచ్చి ఇచ్చి వెడతాను. నీ వేమీ ఆదుర్దా పడకే."

ఆదెమ్మ సంతోషించి– "మంచి వాడవు నాయనా తీసుకురా. ఉత్తరం వచ్చే ఉంటుంది" అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకొన్నది.